# పెళ్ళి ఫార్సు

ఆమధ్య ఎవరో పత్రికతను పనిగట్టుకొని మండుటెండలో పదిమైళ్ళు నడిచి ఓ ముష్టివాడ్ని ఇంటర్వ్యూ చెయ్యడానికి వెళ్ళేట్ట. ఆమాటా యీమాటా మాట్లాడి "బాబూ, నీకున్న కష్టాలేంవిటి?" అని అడిగేట్ట. దానికా ముష్టివాడు తనపనంతా పాడై పోతున్నట్టు కళ్ళెర్ర జేసి, ఎగాదిగాచూసి "సూడు బాబూ! సూపుకి నువ్వు సదూకునోడిలాగే వున్నావ్. నీకామాత్రం తెల్దేటి? అల్లదుగో అటుసూడు. ఆమేడలో యిస్రాంతి తీసుకుంటున్నాడే దొరబాబు ఆ బాబునడుగు ఆ బాబుకున్న సుకాలేటో. ఆయన ఏ కేటి సెప్తాడో అయన్నీ నాకు నేవు. అయ్యే నా కట్టాలు" అన్నాట్ట అంత తేలిగ్గా యింటర్వ్యూ ముగించేస్తూ.

అలావుంది ఇప్పటి నాపరిస్థితి. ఆడవాళ్ళగురించి రాయమంటే నాకేం తోచడంలేదు. సరికదా అసలెందుకు రాయాలోకూడా అర్థం కాలేదు. బహుశా నేనూ ఆడదాన్నే అవబట్టేమో! అంచేత ఆ ముష్టివాడి థియరీ ప్రకారం నేటి ఆడవాళ్ళ కష్టాలు మగవాళ్ళద్వారా రాబట్టగలనేమో అన్న

ధీమాతో మావార్ని ఓ మంచి మూడ్‌లో చూసి పట్టు కున్నాను.

"ఏవండీ, మా ఆడవాళ్ళ కష్టాలేవిటీ" అన్నాను వీలై నంత అమాయకంగా.

ఆయన నన్నోసారి అడ్డంగానూ, మరోసారి నిలువు గానూ చూపుల సర్వే చేసి "చూడమ్మా. నీ బాధలేవిటో నాకు తెలీదు! ఇలా అంటున్నానని బాధపడకు గాని యు మస్ట్ బి ఎ షేమ్డ్ ఆఫ్ యువర్ ఇగ్నొరెన్స్ (You must be a shamed of your ignorance) ఆయన కొట్టేముందు కత్తికెప్పుడూ తేనపూస్తారు.

నాకు నిజంగానే సిగ్గేసింది. ఆయనలా అన్నందుక్కాదు. నేనా పరిస్థితిలో వున్నందుకు ఎంత నిజం! ఎన్ని శతాబ్దాలు గడిచినా, మనం ఎక్కడున్నామో మన మంచి చెడ్డలేవిటో తెలీని "వ్యూహ" దశలోనే యింకా వున్నాం కదా అని మన సులో బాధ వేసింది.

ఆయన ఏవనుకున్నారో ఏమో! అనునయంగా మళ్ళీ పిలిచి, "చూడమ్మడూ, పోనీ నీకున్న దేవిటో అదైనా తెలుసా?" అన్నారు.

"తెలీదు" జవాబు ఆయనదే.

"నీకు తెలిసిందల్లా మొగుడ్ని దుయ్యబట్టుకోవడం. మగాడికేవో సహజ కవచకుండలాలూ, పంచభక్ష్య పరమా న్నాలూ వున్నాయనీ, అవి మీకు లేవనే ఏడుపే కాని, అస

లవి మీకు అవసరమా, మీకేం కావాలి? అదెలా వస్తాయి అన్న ఆలోచనే లేదు. సో యు డిసర్వ్ యువర్ పొజిషన్ ఎండ్..."

ఆ తరవాత నాకింకేవీ వినిపించలేదు,

అవును. అసలు ఆడదానికేం కావాలి?

అసలేం వున్నాయి?

ఏం వున్నా లేకపోయినా బోలెడు సమస్యలు మాత్రం వున్నాయి.

మగాడిలా ఆడదానికి తిండి, ఇల్లు, చదువు, బట్ట, సినీమా, సెక్సు వగైరా కావల్సినా, ఆడదానికి అతి ముఖ్యమైనది పెళ్ళి అని అనాదిగా అందరిలోనూ ఓ అతి పవిత్రమైన మూఢ నమ్మకం వుంది. పెళ్ళంటూఅయితే తతిమావన్నీ ఆటోమేటిక్ అని అనుకునేవాళ్ళే ఎక్కువ అంచేత దానిగురించే ముందుగా మాట్లాడుకుందాం.

తీగ లాగితే డొంకతో పాటు ఒక్కోసారి దాని వేళ్ళు కూడా కదుల్తాయి.

ప్రేమకి, పెళ్ళికి అవినాభావ సంబంధం వుంది. ప్రతి ప్రాణికి-మనిషికి, పక్షికి, పశువుకి ఆఖరికి మొక్కకూడా-ప్రేమ సహజం, అవసరం కూడా. మనిషి మనుగడకి గాలీ, నీరూ ఎంత అవసరమో, ప్రేమా అంతే. కాని, అదే గాలి పెనుగాలిలామారినా. అదే నీరు వరదై పారినా మనిషి అందులో పడి కొట్టుకుపోవడం మినహా చేసేదేంలేదు. ప్రేమ కూడా అంతే.

ఆడదైనా, మగాడైనా అలా జీవితాంతం కనిపించిన వాళ్ళందర్నీ ప్రేమించుకుంటూపోతే అంతుండదు. ఉపయోగం అంతకంటే వుండదు.

వరదలో పారే నీటికి ఆనకట్ట అడ్డులావేసి ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అలాంటి ఆనకట్టలాటిదే ప్రేమకు పెళ్ళి. అంతేకాదు, ప్రేమను మత్తుమందులా సేవించేవాడికి పెళ్ళనేది వో విరుగుడు లాంటిది.

అసలు ఎవరైనా ప్రేమించదలుచుకుంటేనే పెళ్ళి చేసుకోవాలి.

పెళ్ళిచేసుకో దలచుకుంటేనే ప్రేమించాలి.

మరైతే అంతమందీ ప్రేమించే పెళ్ళిచేసుకుంటున్నారా? అన్న ప్రశ్న వస్తుంది.

లేదు. నిజమే.

నీరు వస్తుందన్న ఆశతో ఆనకట్టలు కట్టేస్తే నీరు వస్తే వస్తుంది, లేకపోతే లేదు. పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళల్లో ఎంతమంది పెళ్ళైన తరవాత ప్రేమించుకుంటున్నారు? మరైతే వాళ్ళంతా సుఖంగా బతకటం లేదా అనొచ్చు. లేకేం బతుకుతున్నారు. మరో గతిలేక పెళ్ళనేది చాలా పవిత్రమైనదనీ, ఎన్నిబాధలు పడినా తన స్థానం భర్త ఇంట్లోనేననీ, పాదాల దగ్గర చోటు లేకపోతే కనీసం పాదాల కిందనైనా సరే యింత చోటు దొరికితే అదేమహాప్రసాదమనీ భావించే బలిచక్రవర్తుల

స్టేజిని మనం యింకా దాటలేదు. ఇవన్నీ కేవలం మతపరంగా కొన్ని వేల ఏళ్ళనుండి మనలో పాతుకుపోయి, వేళ్ళూ, ఊడలు తన్నిన నమ్మకాలు, ఇవన్నీ మూఢనమ్మకాలనీ, మూర్ఖత్వాలనీ ఎవరు ఎంత నచ్చచెప్దామన్నా ఎవరూవినరు సరికదా ఆ చెప్పిన వాళ్ళేదో చెడిపోయినట్టు భావిస్తారు.

కాని అదే ఏ శంకరాచార్యో, సాయిబాబానో వచ్చి "ఈ పెళ్ళి పవిత్రం వగైరాలన్నీ చెత్తనీ, వీటిని నమ్మవద్దనీ, ఫలానా వేదంలోనో, పురాణంలోనో వుంది. మరంచేత మీా కిష్టమైతేనే వుంచండి, లేకపోతే పొండి" అని ఒక్కసారి అంటే నూటికి తొంభై తొమ్మిదిమంది "వెళ్ళొస్తాను" అనైనా చెప్పకుండా మొగుళ్ళని వదిలేస్తారు.

రేడియోని కనిపెట్టిన మార్కోనీలా, అమెరికాని కనిపెట్టిన కొలంబస్‌లా 'పెళ్ళి' ఎవరూ కనిపెట్టలేదు. అలాగని సైన్సుకిమల్లే దానికేం థియరీలూ లేవు. పెళ్ళనేది ఒక ఇన్‌స్టింక్ట్ (Instinct). కేవలం (Evolution) లో వచ్చిన ఒక (Event). అందుకే ప్రపంచం అంతటా "పెళ్ళి" ఒకే రకంగా లేదు. పెళ్ళి. డబ్బు యీ రెండు మనిషి తయారు చేసినవి. వాటి విలువలు రోజు రోజుకూ మారిపోతున్నాయి.

"పెళ్ళి పవిత్రమైనది. అందులో వేదోక్తంగానూ, అగ్ని సాక్షిగానూ చేస్తే అది పరమపవిత్రం" అది హిందూమతం.

పెళ్ళిని— "ముత్యాల పల్లకీ, మల్లెపూల పానుపు, ఓర

చూపులు, ఒళ్ళుపులకింతలు" అంటూ అదో అందమైన అను భూతిగా వర్ణించేరు కవులు.

దాంతో పెళ్ళిపేరు చెప్పగానే ఆడపిల్లలు అనవసరంగా సిగ్గుపడి పారిపోవడాలు, పెళ్ళి నిశ్చయం అయిందనగానే మరింకేమీ ఆలోచించక రాత్రనక, పగలనక కలల్ని, ఆ తరువాత పిల్లల్ని కనేయడం చాలా పరిపాటై పోయింది.

అసలీ కలల పైత్యం ఆడదానికే ఎక్కువేమో.

కొంచెం లోతుగా ఆలోచిస్తే, కొంత మోటుగా విని పించినా, పెళ్ళనేది ఒక వ్యాపారం తాలుకు కాంట్రాక్టు మాత్రమే. నిజానికది ఆడది మొగాడికి రాసిచ్చే ప్రామిసరీ నోటు. ఎటొచ్చీ ప్రామిసరీనోటుకు కాలదోషం పట్టడానికి ఒక టైమంటూ వుంటుంది. ఆ లోపల త్రిప్పి రాయకపోతే చెల్లదు. కాని పాపం పెళ్ళికా బాధలేదు. దాని కాలదోషం ఆడదాని జీవితమే. దాని బతుకు తెల్లారితేగాని బాకీ తీరదు. ఈ పెళ్ళికి విట్‌నెస్‌లు, సెక్యూరిటీలు-మంత్రాలు, మంగళ సూత్రాలు. సాధారణంగా వ్యాపారంలో పార్టనర్స్ ఏవో కొన్ని రూల్సు పెట్టుకొని అందులో ఏ వొక్కటి, ఏ ఒక్కరు పాటించకపోయినా విడిపోతాం అని రాసుకుంటారు. పెళ్ళికి మేము ఎన్ని బాధలు పడినా కలిసే వుంటామనీ, కుక్కల్లా కరచుకున్నా సరే విడిపోమనీ" మంత్రోక్తంగా శపథం చేసుకుంటారు. అంతేకాని మేము కలిసి వుండకపోతే విడిపోతాం

అన్న మంత్రం ఎక్కడా లేదు. మంత్రం లేనంత మాత్రాన విడిపోవడం మానలేదు. అందుచేత "డైవోర్సు"లా వచ్చింది. అసలు మంత్రాలన్నీ దేవుడు రాస్తే ఆఖరి మంత్రం (Divorce) మనిషి రాసుకున్నాడు. అంచేత యిదికూడా మంత్రాల ఆఖర్న చేరిస్తే యీ 'లా' పీకి పారెయ్యవచ్చు.

నాలాంటి వాళ్ళెవరైనా తెగించి 'పెళ్ళి' ఒక వ్యాపారం అంటే నేనేదో హిందూమతాన్ని నాశనం చేసిన పురుగు నన్నట్టు చూస్తారు. ఆడవాళ్ళ పవిత్రతని మంటగలిపేస్తున్నా నంటారు. సరే పవిత్రమేనని ఒప్పుకుంటాను. మరి అంత పవిత్రంగా చేసుకున్న పెళ్ళి తరవాత చెప్పులు, కొరడాలు ఎందుకలా ఎగురుతూ వుంటాయి? అర్ధరాత్రిపూట ఆ మద్దెళ్ళ చప్పుళ్ళేమిటి?

ఎవరొప్పుకున్నా, ఒప్పుకోకపోయినా పెళ్ళి మామూలు వ్యాపారమే కాదు. గట్టిగా చెప్పాలంటే పరమ దగాకోరు వ్యాపారం. మగవాడు సంతకెళ్ళి తనకొక ధర లేబిల్ అంటించుకొన్నట్టు నటించి తానమ్ముడు పోవటానికి బదులుగా, ఆడదాన్ని డబ్బు, శరీరం, ఆత్మలతో సహా స్వంతం చేసుకుంటున్నాడు. అంటే యింకో రకంగా చెప్పాలంటే మగవాడి శరీరం = ఆడదాని శరీరం + ఆత్మ + డబ్బు.

ఇలా తయారవుతుంది యీక్వేషన్.

పెళ్ళంటే ఆడది డబ్బిచ్చి తద్దినం కొనుక్కుంటున్నదన్న మాట.

అందరూ ఒప్పుకునే నిజం వెయ్యి అబద్ధాలు ఆడైనా సరే ఒక పెళ్ళి చేయించాలి అని. మామూలుగా అయితే అబద్ధం చెప్పడం పాపం అంటారు. బహుశా పెళ్ళి పవిత్రం అనడంవల్ల ఆ పెళ్ళి చేయించడానికి ఆడే అబద్ధాలకి పాపం అంటుకోదేమో! అబద్ధాలు విరివిగా ఆడొచ్చు అన్న లైసెన్స ఇచ్చేస్తే అడ్డేమిటింక? పెళ్ళి పేరుతో ఎడా పెడా ఆడేస్తారు. "మాఅమ్మాయి చదువుకున్నాకూడా వంట అద్భుతంగా చేస్తుంది." (చదువుతో పూర్తిగా చెడిపోలేదన్నమాట). "మా చెల్లెలు కుట్లూ,అల్లికలంటే పడిచస్తుందనుకోండి. ఎక్కడైనా ఏదైనా చూస్తే అదికుట్టేవరకు నిద్రపోదు." (ఎలాగూ అప్పుడు కుట్టమనం కదా అన్న ధీమాతో.)

ఈనాటికీ ఆడపిల్ల పెళ్ళికి క్వాలిఫికేషన్లు వంట, కుట్లూ మాత్రమే—

"మా అబ్బాయికి అమెరికాలో మొబైల్ ఇంజనీరింగులో సీటు వచ్చింది. ఏదీ పెళ్ళిచేసి పంపించేద్దాం అనుకుంటున్నాం."

(అబ్బాయి చదివింది డిప్లొమా, అదైనా ఆనర్సు)

"మా అబ్బాయికి అసలు డబ్బుమీద ఆశలేదు. పిల్ల నచ్చడం ముఖ్యం."

(అడిగిన కట్నం ఇచ్చేస్తే పిల్ల బేషరతుగా నచ్చుతుంది).

ఇందులో వున్న తమాషా ఏమిటంటే యిద్దరూ నిజం చెప్పడం లేదని ఇద్దరికీ తెలుసు. ఇందులో సాధారణంగా అమ్మాయి తండ్రిదే ఫస్టుమార్కు. అమ్మాయి తండ్రి అలా కొన్నికోట్ల అద్దాల్లాంటి అబద్ధాలతో అమ్మాయి పెళ్ళనే పదంతస్తుల మేడకి ప్లాను వేసేస్తాడు. అబ్బాయికి యాభై వేలో, లక్షో యిచ్చి ఆ ప్లాను అవుననిపించేస్తాడు. పాపం! ఆ తరువాత గాని అతనికి జ్ఞాపకం రాదు యీ పదంతస్తులకీ పునాది లేదని. కాని అప్పటికే చేతులు కాలిపోయేయి. ఆకులుకూడా లేవు. మరంచేత అమ్మాయి జాతకాన్ని ఆ మేడకి రెక్కలుగా కట్టి గాల్లోకి వదిలేస్తాడు, భారం అంతా గ్రహాలదే అన్నట్టు.

ఇన్ని బాధలు పడితే ఆ పురోహితుడు తనకొచ్చిన మంత్రాలేవో నాలుగు చదివేసి, అందరూ ఒట్టి పాపాత్ములైనట్టు, కేవలం తన మంత్రాలవల్లే ఆ పెళ్ళి పవిత్రం అయినట్టు, ఆ తంతు జరుగుతున్నంతసేపూ రాజ్యం చేసేస్తాడు.

భాష అనేది భావం తెలియడానికి. కాని, అది అందరికీ అర్థం అయితే దాని విలువ పోతుందనుకున్నారేమో మన పెద్దలు. ఎవరికీ అర్థంకాని భాషలో పెట్టేరు మంత్రాలు. లేకపోతే నిజంగానే ఎవంకీ అర్థం అవకూడదనే వాళ్ళ ఉద్దేశమేమో! అసలింతకీ బాజాల హోరులో, పసిపిల్లల ఏడుపు రొదలో, ఆడవాళ్ళ పట్టుచీరల రెపరెపల్లో ఆ మంత్రాలు పురోహితుడికిసహా ఎవరికీ వినిపించవు. మధ్య మధ్య "మమ" అను కోండి అని తప్ప, నా కొక్కొక్కసారి అనిపిస్తుంది. అతను

పెళ్ళికీ, తద్దినానికీ ఒకటే మంత్రం చదువుతున్నాడా అని. అలా చదివినా మనం చెయ్యగలిగింది ఏం లేదు, పెళ్ళి తంతు అవుతున్నంత సేపూ పురోహితుడిదే రాజ్యం. అతను నాలాటివాడై మధ్యలో మంత్రం మరిచిపోతే జ్ఞాపకం వచ్చేవరకు పెళ్ళి కూతుర్నో, పెళ్ళికొడుకునో బట్టలు మార్చుకొని రమ్మంటాడు. లేకపోతే అటువాళ్ళ నిటు ఇటువాళ్ళ నటు మార్చి మార్చి కూర్చోపెడతాడు. పెళ్ళి పూర్తయేసరికి వాళ్ళిద్దరు గుంజీలు తీసి తీసి అలిసిపోయిన శివాల్లా అయిపోతారు. అందుకే మొదటి రాత్రులు ఎప్పుడూ అంత ఫ్రూట్‌ఫుల్ కావు.

వీటన్నిటివల్లే పెళ్ళి పవిత్రం అంటే నేను చెయ్యగలిగిందేమీ లేదు. ఇలాంటి ఫార్సు పెళ్ళి ఆడపిల్లకి అవసరమా? అవసరమైతే అంత ముఖ్యమా? ★